క్లుప్తంగా

పొలాల రస్తా ఆక్రమిస్తున్నారు



జేసీ మౌర్యకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన పొలాలకు అకస్మాత్తుగా కొందరు అడ్డగించి రస్తా లేదని చెబుతున్నారని, తమ పొలాలకు ఎలా వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చాగలమర్రి మండలం నగల్లపాడుకు చెందిన రైతులు దస్తగిరమ్మ, బాలదస్తగిరి, నాగేంద్ర జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వారు జేసీని ఆమె చాంబరులో కలిసి తమ పొలాలకు రస్తా చూపించాలని కోరారు. తమ పొలాలకు రస్తా కోసం సర్వే చేయాలని కోరితే సర్వే అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

బీఈడీ పరీక్షలకు 386 మంది గైర్హాజరు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని 16 కేంద్రాల్లో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 3,647 మందికి గానూ 3,261 మంది విద్యార్థులు హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. మొత్తం 386 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఉపకులపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ శ్రామ్ కార్డుతో ప్రయోజనాలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అందించే ఈ శ్రామ్ కార్డులతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ సహాయ కమిషనర్ సాంబశివ అన్నారు. మంగళవారం స్థానిక 48వ వార్డు కొత్తపేటలో ఈ శ్రామ్ కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు ఈ శ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్డులు పొందాలన్నారు.

పదవీ విరమణ వయస్సు పెంచాలి

కర్నూలు(సెంట్రల్) : అంగన్‌వాడీల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితకుమారి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఆఖరు జీతంలో 50 శాతాన్ని పెన్షన్‌గా ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, హెల్పర్ల పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

6న చలో విజయవాడ

కర్నూలు(సెంట్రల్): కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఆటో డ్రైవర్లకు చలో విజయవాడపై అవగాహన కల్పించారు. చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించి విస్తృత ప్రచారం కల్పించాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు పి.మహ్మద్, మాలిక్‌బాషా, కుమార్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఇంటికి వెలుగు

కర్నూలు సిటీ: ఆడపిల్లలు ఇంటికి వెలుగు అని, వారిని బాగా చదివించాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అన్నారు. మాధవీనగర్‌లోని ఆ స్కూల్‌లో మంగళవారం కూతుర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ ఆర్ఐ దుర్గాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, రాధ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలి



ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. మంగళవారం ఆ సమాఖ్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ..మోదీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నారన్నారు.

వేతనాలు చెల్లించాలి

కర్నూలు (సిటీ) : ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో గవర్నమెంట్ ఆర్డర్స్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపాస్) నాయకులు మంగళవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపాస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్న నాగస్వామి నాయక్, పి.నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష...ప్రజలకు రక్ష

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విస్తృతంగా సాగుతోంది. మంగళవారం నగరంలోని శరీన్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పిల్లల నుంచి వృద్ధుల వరకు 400 మందికి పైగా రోగులు వచ్చి చికిత్స అందుకున్నారు. ఇది వరకే వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన సిబ్బంది అవసరమైన వారికి టోకెన్లు అందజేశారు. వీటిని తీసుకుని శిబిరం వద్దకు వచ్చిన వారికి వరుస క్రమంలో మళ్లీ పరీక్షలు నిర్వహించి వైద్యుల వద్దకు పంపించారు. వైద్యులు వారిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు నిర్వహించారు. శిబిరాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై. రామయ్య,కమీషనర్ భార్గవ్‌తేజ సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

– కర్నూలు(హాస్పిటల్)



పోషకాహారంపై అవగాహన కల్పించే స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య,



శిబిరంలో రోగుల పేర్లు నమోదు చేస్తున్న దృశ్యం



వైద్యశిబిరానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు



తాగునీటి వసతి..



శిబిరంలో పిల్లలకు ప్రత్యేక కుర్చీలు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నగర శివారులోని దిన్నెదేవరపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మొదట వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం గురించి కరపత్రం పంపిణీ చేసి అవగాహన కల్పించారని, అనంతరం ఏఎన్ఎం, సీహెచ్‌వోలు ఇంటింటికి తిరిగి అవసరమైన వారికి ఏడు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేసి ఆరోగ్యసేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు ఇచ్చి వైద్యశిబిరానికి తీసుకొచ్చారన్నారు. వారికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శిబిరానికి వచ్చిన మహిళకు మందులు అందజేస్తున్న డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

వైద్య విద్యార్థికి బుట్టా రేణుక చేయూత

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్): తీవ్ర అనారోగ్యపరిస్థితుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థి డాక్టర్ ఇంద్రవతి ఉదయ్‌కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో బుట్టా ఫౌండేషన్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక కలిశారు. అతని వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలను అందజేశారు. కర్నూలులోని అశోక్‌నగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్ తిరుపతిలోని స్విమ్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ పీజీ చదువుతున్నారు. ఈ క్రమంలో అతనికి తీవ్ర అనారోగ్య పరిస్థితి ఏర్పడి కాలేయ మార్పిడి చేసే పరిస్థితికి వచ్చింది. ప్రస్తుతం కాలేయ సమస్యతో బాధపడుతున్న ఉదయ్‌కుమార్‌కు కాలేయ మార్పిడి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు పలు ఆరోగ్య సమస్యలతో ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని గత నెల 24వ తేదీన సాక్షిలో వైద్య విద్యార్థికి కాలేయ సమస్య శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి అతని తల్లి లక్ష్మీబాయిని పరామర్శించి ధైర్యం చెప్పారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడతానని, స్విమ్స్ ఆసుపత్రి వారితోనూ చర్చిస్తానని హామీ ఇచ్చారు.

బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైల్వే గేట్లు మూసివేసి వాటి స్థానంలో ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని టీఆర్అండ్‌బీ సెక్రటరీ ప్రద్యుమ్న ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని రైల్వే గేట్లు రద్దీ రహదారుల్లో ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఓవర్ బ్రిడ్జిలు వేసేందుకు చర్యలు తీసకుంటున్నట్లు చెప్పారు. ఎస్ఈ నాగరాజు మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రయాణికులతో రద్దీగా ఉండే రహదారుల్లో ఉన్న రైల్వే గేట్లను పరిశీలించి వాటి నిర్మాణ వ్యయాన్ని తయారు చేసి ప్రతిపాదనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల ఈఈలు సురేష్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, ఆదోని, కోడుమూరు డీఈలు వెంకటేశ్వర్లు, శివరుద్ర, ఏఈ మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ నాగరాజు, కర్నూలు, నంద్యాల ఆర్అండ్‌బీ అధికారులు

ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చిన్న తనం నుంచే అధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో భగవద్గీత శ్లోకా కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు సహపాఠ్యాంశాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని మండల, జిల్లా, రాష్ట్రా స్థాయిలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో పాఠశాలల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడి విజేతలు జిల్లా స్థాయికి అర్హత సాధిస్తారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్మయ మహరాజ్ చిత్ర పటం వద్ద చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద, ఉపాధ్యాయులు

కేంద్ర సహాయ మంత్రిని తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): 2021 అక్టోబర్ 3వ తేదీన ఉత్తర ప్రదేశ్‌లో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న రైతులను కార్లతో తొక్కించి చంపిన కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు బాధ్యతగా మంత్రిని పదవి నుంచి తొలగించాలని చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు తిమ్మప్ప.. రైతు స్వరాజ్య వేదిక జిల్లా నాయకులు పోతుల శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటరాముడు హాజరై నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాలు

స్పోర్ట్స్

8న జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

కర్నూలు(టౌన్): ఈనెల 8వ తేదీన స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలు సీనియర్స్, జూనియర్స్, అలాగే బాలికల విభాగంలో జరుగుతాయన్నారు. రూ.100 ప్రవేశ రుసుం, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఎంపిక పోటీలకు నేరుగా హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు 9393855460 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

6న రైఫిల్ షూటింగ్ పోటీలు

కర్నూలు (టౌన్) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన స్థానిక అశోక్‌నగర్‌లో ఆర్‌కే రైఫిల్ షూటింగ్ అకాడమీలో అండర్–19 బాలబాలికలకు రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో బాలబాలికలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

డీఆర్వోకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె.మధుసూదనరావును ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. డీఆర్వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు ఆంజనేయులు, మృత్యుంజయ, ఇస్మాయిల్, బాలపీర పాల్గొన్నారు.

సెలవుల్లో సిటీ ప్లానర్

కర్నూలు (టౌన్) : నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న మీనా కుమారి సెలవుల్లో వెళ్లారు. ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆమె సెలవుల్లో ఉండటంతో పరిపాలనా ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్‌గా మోహన్‌కుమార్‌ను నియమిస్తూ మంగళవారం నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు (సిటీ) : సమగ్ర శిక్ష ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా విభాగం (సహిత విద్యా విభాగం)లో సహిత విద్య రిసోర్స్ పర్సన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను ఈనెల 5వ తేదీన పరిశీలించనున్నారు. ఈ విషయాన్ని సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిసోర్స్ పర్సన్ పోస్టులకు మొత్తం 279 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో మానసిక వికలాంగుల విభాగం కింద 94 మంది, వినికిడి లోపం/దృష్టి లోపం విభాగం కింద 185 మంది ఉన్నారన్నారు. ఒక పోస్టుకు ఐదుగురు చొప్పున మెరిట్‌గా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారు సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగే విద్యార్హత ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. వివరాలు rvmssakurnool.blogspot.in లో ఉన్నాయన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఆర్.కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వారు ఈ నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రాంతాల్లోని ఐటీఐ కాలేజీల్లో సంప్రదించాలన్నారు.

సమాజాన్ని కాపాడుకుందాం

కర్నూలు కల్చరల్: సంఘవిద్రోహుల నుంచి సమాజాన్ని కాపాడుకుందామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన చుట్టూనే సంఘ విద్రోహులు ఉన్నారన్నారు. ఆదోని పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఇంటిపై ఎన్ఐఏ అధికారులు దాడులు చేసి విలువైనటువంటి పుస్తకాలు, డాక్యుమెంట్లను స్వాధీనం పరుచుకున్నారన్నారు. ఎప్పటికప్పుడు అనుమానాస్పదంగా ఉన్న వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు.

'సుంకేసుల'కు 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి మంగళవారం 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యామ్‌కు చెందిన ఒక గేట్‌ను అర మీటరు మేర ఎత్తి 2,264 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కాల్వకు 1,616 క్యూ సెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆరోగ్యశ్రీని పక్కాగా అమలు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ విభాగాల అధిపతులతో ధన్వంతరి హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో గత వారం నిర్వహించిన ఆరోగ్యశ్రీ సమావేశంలో పురోగతిపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలు మంచి ప్రగతి సాధించాయని, అందులో జనరల్ మెడిసిన్, డెంటల్, ఆర్థోపెడిక్ ఉన్నాయని అభినందించారు. ఈఎన్‌టీ, గైనిక్ విభాగాల ప్రగతి ఇంకా సాధించాలని సూచించారు. ఆసుపత్రిలోని సైరిక్స్ బయోమెడికల్ ఇంజినీర్స్ అందుబాటులో ఉండేలా వారికి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హెచ్ఓడీలు డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ మంజులబాయి, డాక్టర్ లక్ష్మి బాయి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

వ్యక్తిత్వ వికాసానికి ఎన్‌సీసీ దోహదం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న కల్నల్ అక్షయ్ మాథుర్

కర్నూలు సిటీ: దేహదారుఢ్యంతో పాటు మానసిక ఎదుగుదల, వ్యక్తిత్వ వికాసానికి ఎన్‌సీసీ దోహదపడుతుందని 28వ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ అక్షయ్ మాథుర్ అన్నారు. వెంకాయపల్లె దగ్గర ఉన్న జి.పుల్లయ్య (స్వయంప్రతిపత్తి)ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌సీసీ విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆయన ఆ కాలేజీని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. సెలెక్షన్ కోసం హాజరైన బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. బీటెక్ అనంతరం సాయుధ దళాల్లో ఆఫీసర్లుగా ఎంపిక అయ్యేందుకు ఇది తొలిమెట్టు అని అన్నారు. ఫస్ట్ బ్యాచ్‌కి 40 మంది ఎంపికైనట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డా.వై పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డా.సి శ్రీనివాసరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ జి.శశికుమార్, ఏఎస్ఎం ఎం.మధుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కర్నూలు : అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కర్నూలు నేతాజీ వీధికి చెందిన ఇంద్రకంటి సుజాత (35) కోలుకోలేక మృతిచెందింది. నేతాజీ వీధిలోని ఓ భవనం రెండో అంతస్తులో ఇంద్రకంటి శ్రీధర్ శర్మ, సుజాత దంపతులు నివాసముంటున్నారు. గత నెల 27వ తేదీన సుజాత ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయింది. అదే సమయంలో వెలుతురు కోసం విద్యుత్ లైట్ స్విచ్ వేయడంతో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వ్యాపించి ఆమెకు తీవ్ర గాయాలు కావడమే కాక వంట సామగ్రి కూడా కాలిపోయింది. ఆమెను ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయించగా కోలుకోలేక మంగళవారం మృతిచెందింది. ఈ మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులను ప్రోత్సహించేందుకు బహుమతులు



లక్కీడిప్ విజేతల వివరాలు పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను ప్రోత్సహించేందుకు లక్కీ డిప్ ద్వారా డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు ప్రజా రవాణా శాఖ కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో లక్కీ డిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 16–30 తేదీల మధ్య లద్దగిరి–ప్యాలకుర్తి రూట్లలో ప్రయాణించి, తమ టికెట్ల వెనుక పేరు, ఫోన్ నంబర్, చిరునామ రాసి, బస్సులోకి లక్కీడిప్ బాక్సులో వేసిన ప్రయాణికుల పేర్లతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన ఎం. శ్రీధరమూర్తి యాదవ్, రేష్మా బేగం, సుహాసలకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతి నెలా 1, 16 తేదీల్లో రెండు విడతలుగా బహుమతులు ఇస్తామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు–1డిపో మేనేజరు సుధారాణి, అసిస్టెంట్ మేనేజర్లు సుబ్రహ్మణ్యం, దీప్తి సుజన తదితరులు పాల్గొన్నారు.